ఆత్మలోని అరుణరేఖ

డిసెంబరు ఆఖరు. కాలేజి సెలవలిచ్చారు. సాయంత్రం 'లాన్'లో కూర్చుని పేపర్లు దిద్దుకుంటున్నాను. ఇంతలో రెండో 'పోస్ట్' వచ్చింది. ఒకే ఒక కవరు వచ్చింది. బరువుగా వుంది పేపర్లు ప్రక్కకు నెట్టి కవరు చించాను. విశ్వనాధరావు వ్రాశాడు. నాకు ఉత్తరాలు చదవడంలో వున్న ఓపిక వ్రాయడంలో వుండదు. విశ్వనాధరావు అదోక తరహామనిషి. ప్రత్యుత్తరాలకు నిరీక్షించకుండానే పదేసి పేజీల వుత్తరాలు వ్రాయగలడు సావకాశంగా చదివాను. అత నీ మధ్య రఘునాధరావు దగ్గరకు వెళ్ళాడట. ఆ విశేషాలన్నీ వ్రాశాడు మేము ముగ్గురం బి.యేలో సహాధ్యాయులం! రఘునాధరావు; నేను యం.ఏ కూడ కలిసే చదివాము ఇంగ్లీషులో యం.ఏ పూర్తి అయిాక రఘునాధరావు 'లా'కూడా చదివాడు నా జీవితం సగం గడచిపోయింది. రఘునాధరావు జీవితంలో ప్రవేశించి రెండేళ్ళే అయింది. అతడు చదువు ముగించాక 'సిలోన్' వెళ్ళాడు. జాఫ్నాలో ఏదో ఉద్యోగం వచ్చిందంటూ! అందరికి ఆశ్చర్యమేసింది. కలవారిబిడ్డ ఉద్యోగానికని కాని దేశం పోయాడేమా అని! ఎంచేతో నాలుగేళ్ళయాక తిరిగి వచ్చేశాడు. ఆ తర్వాత నాలుగు నెలలకే అతని పెళ్ళయింది ఇప్పుడు కాకినాడలో న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. ఇదివరకొకసారి వ్రాశాడు నన్ను రమ్మని! నాకూ తీరికా, ఓపికా లేకపోయాయి! యీ మధ్య భార్యతోపాటు దేశమంతా తిరిగి వచ్చాడుట. విశ్వనాధరావు వ్రాశాడు. "వాళ్ళదిరా! సంసారమంటే! ఎంత అన్యోన్యమనుకున్నావు"

అని. నవ్వు వచ్చింది. వెళ్ళి చూడాలనిపించింది. మరునాడే ప్రయాణమై వెళ్ళాను.

రైలు స్టేషన్‌నుంచి జట్కాలో వెళ్తున్నాను. దారిలో మెడికల్ షాప్ కనపడింది. గొంతులో ఏదో గరగరగా వుంటే 'లాజెన్ జెస్' కొనుక్కుందామని దిగి వెళ్ళాను. అక్కడ ఎవరో ఒకమ్మాయి మందులు కొంటోంది సన్నగా, తెల్లగా వుండి చాలా నాజూగ్గా, అందంగా కనపడింది కట్టు, బొట్టు తీరు చాలా అధునాతనంగా కనుపించింది. బిల్లు చూసి డబ్బిచ్చేసి వెళ్ళి బైటవున్న కారులో ఎక్కింది వెళ్తూ వెళ్తూ నన్ను జూసింది 'చాల చురుకు చూపు' అనుకున్నాను. తరువాత రఘునాధరావు ఇంటికెళ్ళేసరికి బైట, మెడికల్ షాప్ దగ్గర కనపడిన కారు కనపడింది. అనుమానిస్తూ లోపలికి వెళ్లాను 'రఘునాథం' అన్న నా పిలుపుతో వాకిట్లోకి వచ్చాడు రఘునాధరావు. నన్ను చూడగానే బలంగా నా భుజాలు, చేతులు నొక్కేస్తూ 'ఆరినీ: ఇదేమిటిరా! ఎట్లా వచ్చావు? గాలితోనైనా కబురంపలేదే! ఇల్లెలా తెలుసుకున్నావ్' అంటూ ఆప్యాయంగా పల్కరించాడు. "ఏమిటి యిలా వున్నావేం! ఒంట్లో బాగా లేదా" అన్నాను. "ఊ! మొదలెట్టావూ! ఇంత నల్లబడ్డావేం! గుర్తేపట్టలేకపోయాను.అయ్యో! ఎలా వుండేవాడిని! అనరా—అను. సందేహమెందుకు?—పరామర్శిస్తున్నాడయ్యా పరమమిత్రుడు!" అని పకపక నవ్వుతూ చెయ్యి పట్టుకుని లోపలికి తీసికెళ్ళాడు! లోపలనుంచి హిందుస్థానీ కూనిరాగ మొకటి సన్నగా వినవచ్చింది. "మా అరుణ బాత్‌రూమ్ సింగర్‌లే—అన్నట్టు నీవసలు చూడనే లేదుకదూ" అన్నాడు రఘునాధరావు ఇంతలోనే అతని భార్య వచ్చిందక్కడకు. మెడికల్‌షాప్‌లో కనపడిన అమ్మాయే! అప్పుడే స్నానం చేసిందేమో, చాల శుచిగా కనపడింది. లేత మబ్బురంగు స్విట్జర్లెండు వాయిల్ చీర కట్టుకుంది. తెల్లని సిల్కు 'బ్లవుజు' వేసుకుంది. వెన్నెల రాత్రిలాగ కళ్ళకు చల్లగా వుంది ఆమె వస్త్రధారణ! ఆమె నా వంక తెల్లపోయి జూచింది మా యిద్దరి తొట్రుపాటూ గమనించిన రఘు

నాథం 'అరుణా, యీయన నీకిదివరకు తెలుసేమిటి?' అన్నాడు. 'ఊహూ' అన్నట్టు తల పంకించింది. 'ఇందాక మెడికల్ షాప్‌లో కన పడ్డారు' అన్నాను. 'అదా! అరుణా——వీడే ప్రభాకర్ అంటే నేను చెప్పా నుగా నీకు ఇప్పటికి తీరింది వీడికి మనింటికి రావడానికి' అని నన్ను పరిచయం చేశాడు భార్యకు. ఆమె చిన్నగా నవ్వి నమస్కారం చేసింది నాకు. నేను తిరిగి నమస్కారం చేశాను. 'మీరు రాలేదని చాలాసార్లను కున్నారువారు' అన్నది నాతో! తీగ మీటినట్లుంది కంఠం "అనుభవాలతో మాసిపోని సరిక్రొత్త జీవితంమీది. అందుకని మీవద్దకు త్వరగా రావ టానికి మనసొప్పలేదు" అన్నాను నవ్వుతూ! నా నెరిసినజుట్టు మరింత తెల్లవడినట్లు విచిత్రమైన అనుభూతి పొందాను. "అబ్బాయీ! అది మమ్మల్నేమీ అభినందించటంకాదు అవకాశాలు లభించనంతవరకూ అను భవమెలా కల్గుతుంది" అన్నాడు రఘునాథరావు.

ఆ డ్రాయింగ్ రూమ్, ఆ ఫర్నిచర్, వాటిమీద పరచిన ఎంబ్రాయి డరీ సరుకు-అంతా అరుణా కళాకౌశలాన్ని తెల్పుతున్నాయి 'ఫ్లవర్ వేస్'లో రకరకాల పూలు, రంగు రంగుల పట్టుచీరలు కట్టుకుని పేరం టానికి వెళ్ళి, దగ్గరసాచేరి కబుర్లాడుతూ నవ్వుకునే ఆడవాళ్ళలావున్నాయి మధ్యాహ్నం భోజనాలయాక, అరుణ 'ఫోటోల ఆల్బమ్' తెచ్చిచూపింది. నా ప్రక్కనే కుర్చీలాక్కుని కూర్చుంది. అరుణ వస్తుతః ముద్దరాలై యుండికూడ, కాలేజి చదువు ఇత్యాది సంస్కార విశేషాలవల్ల మగ వాళ్ళంటే బెరుకుపోయిందో లేక, ఏ విధమైన కృత్రిమ నాగరికతవాసన సోకని అడవి మల్లెలాంటి అచ్చమైన ప్రకృతి కలదో తెలియలేదు. మనకు పకపకనవ్వే ఆడవాళ్ళకంటే- మందహాసాలు చేసే మగువలంటేనే ఇష్టం! పూర్తిగా వికసించిన గులాబి పువ్వుకన్న అరవిచ్చిన గులాబులే అంద మైన వంటాము అందుకే, మన ఆడపిల్లలు కోయపడుచుల్లాగ నోరువిప్పి నవ్వరు. మనం పెంచే గులాబులు అరవిచ్చి అలానే కాసేపుండి మన్ని మురిపిస్తాయి'. అడవిపూలకు 'మొగ్గతనం' పోయి 'పూవులతనం' రాగానే పూర్తిగా విచ్చుకుని పక పకా నవ్వుతాయి బహుశః అరుణ ప్రకృతి ఇటు

శాఖ గ్రంథాలయం,
మురపాక,

4872

వంటిదేమోనని తోచింది. వాళ్ళిద్దరూ ఆ మధ్య దేశమంతా తిరిగి వచ్చి నప్పటి విశేషాల ఫోటోలు చూపుతోంది. తాజ్‌మహాలు చూపించినప్పుడు అరుణ భర్తకేసి చూచి 'చెప్పనా' అని నవ్వింది. తలెత్తి రఘునాథాన్ని చూచాను, 'చెప్పు' అని నవ్వినట్లే నవ్వాడు. అందమైన అతని కళ్ళు? పెదవులు నిజంగా నవ్వాయనే ఆమె అనుకుంది. ఆ కళ్ళ అడుగు లోతుల్లో, ఆ పెదవుల వంపులలో నిగూఢంగా సుడి తిరిగిపోయిన విషాద రేఖలను గుర్తించటానికి అరుణ సంస్కారం చిన్నదైపోయింది నాకా శ్చర్యంవేసింది. ఆ నవ్వు, నవ్వే కాదనిపించింది. నేను నవ్వేసి 'ఏమిటో చెప్పండి అనుజ్ఞ తీసుకున్నారుగా' అన్నాను. 'అనుజ్ఞ' అనేమాట రుచించ నట్టుగా అరుణ ఒకసారి కనుబొమలు దగ్గరగాదీసి ముడివేసి మళ్ళా వూడ దీసింది "ఏరే....తాజ్‌మహల్ చూచి బైటనే నిలబడిపోయారు లోపలికి రానన్నారు బలవంతంగా లాక్కెళ్ళాను. ఎక్కువ సేపు వుండలేకపోయా రక్కడ పైగా ఏడ్చేశారు. నిజంగా! కావాలంటే అడగండి అబద్ధమేమో! ఎందుకు అంటే' 'వూరికే ఏడ్పు వచ్చింది' అన్నారు. ఆరాత్రి మళ్ళీ వెన్నెలలో తాజ్‌ను చూడటానికి రమ్మన్నాను రానన్నారు. నేనొక్కతెనే ఇంకెవరినో తోడు తీసుకొని వెళ్ళాను మళ్ళీ వచ్చి చూద్దును గదా. 'రూమ్'లో ఏడుస్తున్నారు. మగవాళ్ళట పైగా మీరు అడగండి పోనీ!" అంటూ పకపక నవ్వింది పసిపిల్లలాగ! నేనూ నవ్వేశాను. రఘునాథం నవ్వాడు.

ఆ తర్వాత రఘునాథం 'సొంత' అల్బమ్ అంటూ తీసుకొచ్చింది అంటే పెండ్లికిముందు రఘునాథరావు సేకరించిన అల్బమ్ అని ఆమె భావం పెళ్ళయ్యాక 'స్వంతం' అనేది అందరికి నశిస్తుందా? వీడికేనా? అనుకున్నాను మొదటిపేజీలు చాలా దాటేశాను. అవన్నీ నాకు తెలిసినవే! ఆ పేజీలనిండా మేమే! తరువాత జాఫ్నాలో అతని జీవితం ఎలా వుండేదో చూదామని పేజీలు నెమ్మదిగా తిప్పుచున్నాను. ఏవో ఫోటోలు. ఆడవాళ్ళవి, మగవాళ్ళవి చాలా కనుపించాయి. కాని అందరూ చాలా పెద్ద మనిషి 'పోజ్' ఇచ్చినవారే! వెనుక పేజీల్లోవున్న మాలాగా, జంతువుల

లాగా స్వేచ్ఛగా వున్న ముఖం ఒకటీ కనపడలేదు ఒక పేజీలో ఏదో ఒక 'ఫామిలీఫోటో' చూపింది అరుణ. అందులో ఒకమ్మాయిని చూపి యీామె వీరి 'కాలీగ్' అట. 'పొయిట్రీ' లెక్చరర్ అని కదండీ చెప్పారు అని భర్తకేసి చూసింది. 'ఊ' అన్నాడు రఘునాథం. 'వీరు వాళ్ళ అమ్మా నాన్న, చెల్లెలూ, తమ్ముడూనట' అని పరిచయం చేసింది. 'ఇంగ్లీషు డిపార్ట్‌మెంటే' నన్నమాట? ఎవరేమిటి వీళ్ళు?' అన్నా. 'మళయాళీలు. అసలువూరు కాలికట్' అన్నాడు రఘునాథం-అతని ముఖం చాలా తమాషాగా మారింది.

'మీరు చెప్పండి యీామె బాగుందా, యీామె చెల్లెలు బాగుందా' అని అరుణ నన్నడిగింది ఫోటోకేసి చూపిస్తూ! ఒకమ్మాయి, అమ్మాయిల అందం గురించి అంతగా పరిచయంలేని నాతో ప్రస్తావించటం క్రొత్త అనుభవం! సందేహంలేదు. అరుణ అడవి మల్లెలాంటిదే! నే నేమీ చెప్పక ముందే "నేను చెల్లెలే బాగుంటుం దంటాను. వీరు ఒప్పుకోరు" అన్నది. "అంటే అక్క బాగుంటుందనేగా అర్థం! ఏరా?" అని రఘునాథాన్ని పరాచికమాడాను. వాడు నవ్వాడు. ఇందాకటి నవ్వే! అది నవ్వుకాదు. నాకు తెలుసు.

మరునాడు ప్రొద్దెక్కి లేచాను. ఇంట్లో ఎవరూ కపసడలేదు. ముఖం కడుక్కుని బైట తోటలోకి వచ్చాను. దూరంగా రఘునాథం పచార్లుచేస్తూ, సిగరెట్ కాలుస్తూ, పత్రిక చూస్తున్నాడు. 'స్లిప్పర్లు' తొడుక్కుని తోటలోకి వెళ్తున్నాను ఒకప్రక్కన సన్నజాజి పందిరిదగ్గిర అరుణ నిలబడి పూలు కోస్తోంది! తలంటి పోసికున్నట్లుంది. జుట్టు వీపు మీద పరచుకుని వుంది. పొడుగ్గాలేవు వెంట్రుకలు! చివర్ల మెలికలు తిరిగి నీరు కారుతున్నాయి! సన్న జరీఅంచు పట్టుచీర కట్టుకుంది. చేతిలో పూలసజ్జ కనపడింది. నా నడక అలికిడికి వెనుతిరిగి నన్ను చూచి నవ్వింది. ఎర్రటి బొట్టు, నల్లటి కాటుక కొట్టొచ్చినట్టు కనబడ్డాయి: అలలుతీరిన ఆమె జుట్టు ముఖాన్ని సగం కప్పి, సగం కప్పనట్లున్నది. అప్పటి అరుణ ముఖం కంటే, రఘునాథానికి వార్తాపత్రిక ఎలా వచ్చిందోననుకున్నాను.

రఘునాథం నన్ను జూచి 'పద, కాఫీ తీసుకుందాం' అన్నాడు. ఇద్దరం వస్తున్నాం. అరుణ మమ్మల్నీ చూచింది. 'మీరుకూడా రండి' అన్నాను. 'నా కాలశ్యముంది-మీరు వెళ్ళి తీసుకోండి' అన్నది.

"ఇవాళ శుక్రవారంగా! ప్రొద్దున్నే తలస్నానం ఆపైన పూజ! ఆ వ్యవహారం తొమ్మిది, తొమ్మిదిన్నరయితేగాని తెమలదులే" అన్నాడు రఘు ఆ మాటల్లో ఏమీ విసుగు ధ్వనించలేదు. నాస్తికుడుగా వాదించే 'పాత' రఘు గుర్తువచ్చి ఆశ్చర్యమయింది. అరుణ ఇంట్లోకి వచ్చింది. పూలసెజ్జ నిండివుంది. పూజ గది కాబోలు చిన్నరూమ్‌కేసి వెళ్ళింది. పసుపు రాసుకుందేమో, కాళ్ళు పచ్చగా కనుపించాయి. 'స్లిప్పర్లు' లేకుండా తోటలో తిరిగిందేమో—గులకరాళ్ళు గ్రుచ్చుకొని కందిపోయి కొంత, ఎఱ్ఱమట్టి తాలూకు ఎఱ్ఱదనం కొంత కారణాలుగా ఆమె పాదాల అంచులు ఎరుపెక్కినాయి

ఆ రోజు ఊరిలో అక్కడక్కడ తిరిగివచ్చాం ముగ్గురమూ! ఆ మధ్యాహ్నం రఘునాథం భార్యను చూచి 'యీ రోజు, నీవెళ్ళి మీ పార్వతిని చూచి రారాదూ! ప్రభాకర్ వున్నాడుగా నాకు తోడు" అన్నాడు "నిజమే నేవెళ్ళివస్తా! పాపం దానికి జ్వరం తగ్గిందోలేదో, అప్పుడు టైఫాయిడ్ అనుకుంటున్నారు వాళ్ళు" అన్నది. చీరే అదీ మార్చుకుని వాళ్ళెవరింటికోపోతూ నాతో చెప్పింది. "వీరిని చల్లగాలికి తిరుగనీకండి" అని ఆమె చూపేశ్రద్ధకు నా ఒళ్ళు గగుర్పొడిచింది అప్పుడు గుర్తొచ్చింది. నిన్న ఉదయం మెడికల్‌షాపులో అరుణను చూచినమాట! "ఈ మధ్య ఏమైనా మంచామెక్కావేమిటి?" అన్నాను. "ఆ! ఏంలేదు నాలుగు రోజుల జ్వరం. ఊరికే ఆర్భాటం చేస్తుంది" అన్నాడు రఘు.

అరుణ వెళ్ళగానే, ఇద్దరమూ తోటలోకి వెళ్లాం! చాలరకాల పూలు. ఢాలియాలు, పాపీస్, డైయాథస్‌లు, యాస్టర్లూ, వయోలాలు, కనకాంబరాలు! నేల కానుకున్నట్లున్న చిన్న మొక్కలకూ పూలే, మనిషి ఎత్తున వున్న పెద్ద మొక్కలకు పూలే! వేరే పనేమీలేనట్టు పంతాలేసుకుని, విరియబూసి మంతనా లాడుతున్నాయి ఇక గులాబులు, మల్లెలు జాజులు-

పనికి లెక్కలేదు "ఆమెకు మొక్కలంటే చాల శ్రద్ధనుకుంటానే" అన్నాను "శ్రద్ధేమిటి? పిచ్చి! నాకీ తోటలో తిరగటమంటే తలనొప్పి. తిరిగినా వీటికేసి చూడను ఇన్ని రకాల పూలు, ఇన్ని రకాల అందాలు, వేన్నీ మెచ్చుకోలేం!" అన్నాడు. నేను ఆశ్చర్యంగా చూశాను. ప్రక్కనే నా భుజానికి తాకిన థాలియా కొమ్మ పట్టుకుని, ఎఱ్ఱగా విచ్చిన ఆ పువ్వు జూపి "దీన్ని చూడు ఎలా వుంది?" అన్నాను. పట్టలేనంత అందంగా వుంది. అది వాడిపోకముందే, గుండె చీల్చుకుని లోపల దాచుకోవాలని వుంది" అన్నాడు. భార్య లేనప్పుడు ఇంత ఉద్రేకంగా మాట్లాడుతున్నాడే అనుకున్నాను అయినా, అందిమూ, అనురాగమూ తనలో నింపుకున్న 'అరుణ' అందుబాటులోనే వున్నవీడు, ఇంకా 'అందం దాచుకోటం' (అనుభవించటం కాదు), "గుండె చీల్చుకోటం"- అనడం చూస్తే, "ఎందుకు వీడు పరితపిస్తున్నాడా" అనుకున్నాను ఇంతకు మించిన వారి పైన వీడికి వాంఛ వున్నదా ఏమో! అమావాస్యరోజున చంద్రుడు కన పడలేదని విచారించేవారు, నీలాకాశమూ, రోజుకన్న ప్రస్ఫుటంగా మెరిసే చుక్కలు-వీటి అందాన్ని అస్వాదించలేరు. ఆలోచనలు తెముల్చు కుని ఏమిట్రా అలా వున్నావు? చాల మారిపోయావ్. అసలు సంగ తేవిటి?" అన్నాను.

ఏదో—చెప్పబోయేదానికి నాంది అన్నట్లుగా. నాచేతులు తన చేతి లోకి తీసుకొని నెమ్మదిగా నొక్కాడు, అక్కడే పచ్చిక పైన కూల బడ్డాం!

"నేను జాఫ్నాలో వుండగా మా డిపార్ట్మెంట్ లోనే, ఒకమ్మాయి వుండేది. పేరు రంజని. "పొయిట్రీ" లెక్చరర్ అంటూ మొదలేశాడు. నేనిట్లాంటిదేదో వుంటుందని వూహించాను.

"ఇందాక నీ భార్య చూపిందే, ఆ ఫోటోయేనా" అన్నాను. అప్పటి రఘు ముఖకవళికలు గుర్తుకువచ్చి! "ఆ!—ఆమె అంటే మొదటినుంచి నా కదొక విధమైన...." మాట దొరకలేదతనికి. అతడు నవ్వి. "ప్రేమా, గీమా" అనకు సుమా! ఏదో చెప్పలేనుగాని" అన్నాడు.

అతడు చెప్పలేకపోయినది నేను చెప్పలేనుగాని, వూహించగలిగాను.
"అందమైన దేనా?" అడిగాను. మనుష్యుల వర్ణన—పుస్తకాల్లో, కథల్లో
అంటే ఏదో వ్రాసేయ వచ్చుకాని, ఒక స్నేహితుడి దగ్గర అమ్మాయిల
అందం గురించి నిజం "నిజం"గానే చెప్పాల్సివస్తే కష్టమే! వాడు ఆలో
చించినట్లాలోచించి "రంజని అందం గురించి నీకు చెప్పాలంటే నాకేమీ
స్వంతమాటలు లేవురా! ఎప్పుడో చదివాము గుర్తుందా:... " "పది నిము
షాలామె వంక తేరిపార చూచినా, ఆమె అందగత్తె ఔనో, కాదో తేల్చు
కోలేకపోయాను. ఎందుకో ఆమె నన్ను చూచి నవ్వింది. వెంటనే అనిపిం
చింది- ఆమె చాల అందమైనదని ఇదే నా ప్రథమానుభవం కూడ!" అని
క్లుప్తంగా ముగించాడు. "తర్వాత?" అన్నాను. చిన్నప్పుడు దయ్యాల
కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు విన్నప్పుడుండే ఉత్సాహం, తొందర
మళ్లా కనబర్చాను.

"మొదట్లో నేను ఎక్కువగానే మాట్లాడేవాడిని రంజనితో! ఆమె
చాలా ముక్తసరిగా జవాబులు చెప్పేది. ఒక ఏడాది గడిచాక, నా మనస్సు
ఆమెకు మరీ దగ్గరవ్వాలనుకోవటం మొదలెట్టింది, ఆలోచనల తర్వాత
బుద్ధితో మనస్సుకు కళ్లెం వేశాను. మాట్లాడడం చాలా తగ్గించేశాను.
సాధ్యమైనంతవరకు ఆమెను కలుసుకోటం మానేశాను! క్లాసు లైపోగానే
'రూమ్' కెళ్ళిపోయేవాడిని. కొన్నాళ్ళ తర్వాత ఒకనాడు ఆ అమ్మాయి,
చెల్లెల్ని వెంటబెట్టుకు నా 'రూమ్'కు వచ్చింది. ఆశ్చర్యపోయాను అక్క
డింకెవరియింటికోవచ్చినట్లు, దారిలోవుంది కనుక నారూమ్ కేసి తొంగి
చూసినట్లు చెప్పింది. కాని అంతా అబద్ధం నిజమీనాడు తెలిసింది నాకు
లేనిపోని అభిమానంతో నిజాన్ని దాచివేసింది. కావాలనే నా రూముకు
వచ్చిందారోజు. లోకంకోసం చెల్లెల్ని వెంట తీసికొచ్చింది. చాలా
స్వేచ్ఛగా మాట్లాడింది. నామనస్సు మళ్ళీ కొంచెం పట్టుతప్పింది. ఆ
తర్వాత ఆ అమ్మాయి రోజూ కొంతసేపైనా నాతో మాట్లాడేది. బాగా
నవ్వేది. ఆమె మాట్లాడే మాటల్లో, చాల వాటికి ఏమీ అర్థం వుండేది
కాదనే గుర్తు. నాలోపల 'వాంఛ' విజృంభిస్తుంటే, దాన్ని జయించి నిర్వి

కారంగా ఆమెతో మాట్లాడాలంటే చాల కష్టమయ్యేది. ఆమె నడవడి నా శీల ప్రవర్తనలపై సవాలు చేస్తోందా—అనుకుని చిరాకుపడేవాడిని చాలా సార్లు. కాని రంజనిపైన ఎప్పుడూ కోపం వచ్చినట్లు జ్ఞాపకంలేదు. ఆశ్చర్యమేమిటంటే, నేను మాట్లాడడం తగ్గించిన కొద్దీ, ఆమె మరింత పలుకరించేది ఇలా కత్తిమీద సాముగా ఇంకో ఏడాది గడిపాను. నాకు పిచ్చెక్కేంత పని అయింది. పోనీ అడిగేద్దామా అంటే భయం! లోకు వవుతా నేమోనని! ఇక ఆ వాతావరణం భరించలేక వేసవి సెలవల కింటికొచ్చిన వాడిని మళ్ళీ తిరిగి వెళ్ళకుండా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాను. ఆ తర్వాత నాలుగు నెలలకే అరుణను పెళ్ళి చేసుకున్నాను. జాఫ్నాలో నా 'కొలీగ్స్' అందరికి ఆహ్వానాలు పంపాను. చాలమంది దగ్గర నుంచి వుత్తరాలు, వైర్‌లూ వచ్చాయి రంజనివద్ద నుండి ఏమీ ప్రత్యుత్తరం రాకపోయేప్పటికి ఆశ్చర్యపోయాను కాని, క్రమంగా ఆమెను మర్చిపొమ్మని ప్రోత్సహించే 'బుద్ధి' ఇదీ మంచికే లెమ్మంది— మనస్సు రవ్వంత బాధపడినా! ఆతర్వాత అరుణ మంచితనాన్ని చాలా అనుభవించాను. ఇప్పటివరకూ నేనుగూడ ఆమె కెటువంటి అసంతృప్తినీ కలిగించలేదనే అనుకుంటున్నాను. ఒకఏడాది ఏ చింతా లేకుండా వున్నాను. తర్వాత ఒకనాడు జాఫ్నానుంచి ఒక కవరు వచ్చింది. అదృష్టం! అరుణ ఆనాడింట్లోలేదు. చింపి చదివితే రంజని వుత్తరమయింది.

"నీవు అరుణను ప్రేమించానన్నావుగదా, రంజని సంగతిఆమెవద్ద ఎందుకు దాచావు" అని అడిగాను.

రఘునాథం ఆశ్చర్యంగా "మన కష్టాలు మనం ప్రేమించేవాళ్ళ కై నాసరే చెప్పుకునేటప్పుడు ఎక్కువగా ఆలోచించాల్సింది వాళ్ళ మంచి తనం కాదురా, కావల్సింది గుండెనిబ్బరం, విని భరించగలరా! అని- అందుకనే అరుణకు చెప్పలేదు" అన్నాడు. వాడు తన కథంతా నాకెందుకు చెప్తున్నాడో అర్థమైంది. నా మంచితనంమీద నాకు ఒకవీసమెత్తు నమ్మకం తగ్గింది. "సరే-రంజని ఏం వ్రాసింది" అన్నా, "నేను ఆమెకు పంపిన ఆహ్వానపత్రిక చేరలేదుకాబోలు! "నా ప్రేమ నీవు తెలుసుకున్నావు

కనుకనే, నీ పెండ్లికి నన్ను పిలవ సాహసింపలేకపోయావు! ఈ వార్త యితరులవల్ల తెలిసినప్పుడు నే నెంత కృంగిపోయానో-ఎలా వ్రాయను? ఏడాది ఓర్చుకున్నా నీబాధఒంటరిగా. ఉపశాంతికొరకు యివాళ వ్రాస్తున్నా. నీయందు పూర్తినమ్మకము లేనందువల్లే, నేను నా ప్రేమ బాహాటంచేసి భిక్షగోరలేదు. కాని దురదృష్టం! నా మనస్సు నీవు గ్రహించావు నా అభిమానం దెబ్బతిన్నది. నేను ఓడిపోయాను. అందు కేమీ ప్రతిఫలం లేదు నాకు. నీ మనస్సులో నన్నెంత తేలికచేసినా, కనీసం నాపై, నీ సుఖాన్ని కోరే వ్యక్తిగా పూర్తి నమ్మకముంచు" అని వ్రాసింది. "ఇంతే! మేఘాలను దూసుకొనిపోయే విమానం హఠాత్తుగ నేలకూలడం లాంటి అనుభూతి యిది" అన్నాడు రఘునాథం.

"నీవు జవాబు వ్రాయలేదా" అన్నా!

"ఆహ్వాన పత్రిక తనకుకూడ పంపినట్లు వ్రాశాను. నాపై తన కున్న కోరిక నాకీషణ్మాత్రమైనా తెలియదని చెప్పాను. ఆశయా, అనురాగాలూ అంత గోప్యంగా గుండెల్లోనే దాచుకుని అణగారిపోవటానికి వేనేమైనా ఆకాశ కుసుమాన్ననుకున్నావా?' అని ముగించాను. అంతకంటే ఏం వ్రాయను?" అతని గొంతేకాదు—శరీరముకూడ కొంచెం కంపించినట్లు సంధ్య వెలుగుల్లో గుర్తించగల్గాను.

"ఆ తర్వాత మళ్ళీ ఆమె వ్రాయలేదా" అన్నాను.

"ఉహూ! ఏమీ వ్రాయలేదు. కాని నా ప్రేమ ప్రతిబింబాన్ని నేను గుర్తించలేదని తెలిశాక, ఎండిపోయిందనుకున్న ఆమెపై నాకున్న ప్రేమ క్రొత్త చిగురేసింది! ఏమీ చేసేస్థితిలో లేను నేనునాకాలు చేతులు నేనే విరగ్గొట్టుకున్నాననిపిస్తుంది. అరుణ అమాయకురాలు మరీ సుకుమారమైన జాజిపువ్వులాంటిది. జాగ్రత్తగా చూచుకోవాలి! ప్రేమ ఒకచోట, దాని ప్రకటన మరొకచోటగా బ్రతుకుతున్నాను" అన్నాడు. ఇప్పుడర్థమైంది నాకు! రఘునాథం అరుణపై చూపేది ప్రేమకాదు,—అది లాలన, దయ, ఆదరణలాంటిది! ఇంతలోనే కారు చప్పుడైంది! అరుణ వచ్చింది!

"చీకటయిపోయింది ఇంకా తోటలోనే వున్నారేం? ఇంట్లోకి పదండి మంచుకురుస్తోంది" అన్నది. రఘునాథం నవ్వు తెచ్చుకొని లోపలికి వచ్చాడు. చాలా ఆప్యాయంగా అరుణను, ఆమె స్నేహితురాలి ఆరోగ్యవిషయం విచారించాడు. నిజమే! అలా బ్రతకటం రఘునాథానికే చేతనయింది!

మరునాడు ప్రయాణం కట్టాను స్టేషన్‌కు వచ్చారిద్దరూ; రైలు కదలబోతుంటే రఘు నా చేయి నొక్కుతూ "ఎవ్వరితో అనకేం!" అన్నాడు. నాకంటే రాతిగుండె కలవాళ్ళు మా మిత్రబృందంలో మరెవ్వరూ లేరని రఘునాథం అభిప్రాయం కాబోలు!

రైలు, రైలుతోపాటు చెట్లూ, చేలూ, పైన మబ్బులూ, నా ఆలోచనలూ, అతివేగంగా పరిగెత్తుతున్నాయి. అన్నింటికి ఒక్కసారే 'బ్రేకు' పడినట్లు మావూరి స్టేషన్ వచ్చింది. ఆ రాత్రి పడుకున్నాను. రఘునాథమే మెదులుతున్నాడు మనస్సులో! ప్రపంచంలో అక్కడక్కడ నిర్లిప్తమైయున్న కరుణ, సహనము, అభిమానము ఇత్యాది ఉత్తమ భావాలకు అందమైన శరీరం కనిపించగానే, దానిలో లీనమైపోవాలనే కోరిక కలుగుతుంది కాబోలు. లేకపోతే, రఘువంటి వ్యక్తిని మనం కలుసుకోలేము!

—o—